సాక్షి తిరుపతి

గురువారం । 3 । జూలై । 2025



నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

వాహనాల నంబర్ ప్లేట్ల విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. - 8లో



బడి కోసం.. ఆగని పోరాటం

పాఠశాలల విలీన ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. - 8లో



కొలువుల కోత

సచివాలయాల రేషనలైజేషన్ పేరుతో కుట్రపూరితంగా ఉద్యోగుల సంఖ్య తగ్గిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

అరణియార్‌లో చేపల వేటపై నిషేధం

నాగలాపురం : పిచ్చాటూరు మండలంలోని అరణియార్ ప్రాజెక్టులో ఆగస్టు 31వ తేదీ వరకు చేపల వేటపై నిషేధం విధించినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి రాజేష్, ఎఫ్‌డీఓ మధుసూదన్‌రావు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ చేపల సంతానోత్పత్తి నేపథ్యంలో రెండు నెలల పాటు వేటను నిలుపుదల చేసినట్లు వెల్లడించారు. ఆదేశాలను అతిక్రమిస్తే మత్స్యకారుల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు సహకరించాలని కోరారు.

దివ్యాంగులకు ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్ : జిల్లాలోని దివ్యాంగ నిరుద్యోగ యువతకు ఉచితంగా కంప్యూటర్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులు మీరా షైనీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా చేసిన 19–34 ఏళ్ల వారు మాత్రమే అర్హులని వెల్లడించారు.ఆసక్తిగలవారు సదరన్ సర్టిఫికెట్‌తోపాటు ఆధార్‌కార్డు, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో తిరుపతిలోని భవానీ నగర్ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో యూత్ ఫర్ జాబ్స్ కార్యాలయానికి రావాలని కోరారు. ఇతర వివరాలకు 9347411952 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

హస్త కళాకారులకు అండగా ఉంటాం



కళంకారీ వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్ : జిల్లాలోని హస్త కళాకారులకు అండగా ఉంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏపీ హ్యాండ్ క్రాఫ్ట్ కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్‌తో కలిసి డీఆర్‌డీఏ, డీఐసీ, లేపాక్షి, శిల్పారామం, టూరిజం, నాబార్డ్ , హ్యాండ్‌లూమ్స్, ఖాదీ బోర్డ్, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ వన్ డిస్ట్రిక్ట్- వన్ ప్రొడక్ట్ లక్ష్యంతో కళాకారులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. హస్త కళంకారీకి మార్కెట్ కల్పించేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు. ఉత్పత్తి, లాభం, ప్రచారం నినాదంతో కళాకారులకు చేయూతనందిస్తామన్నారు. అందరికీ బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హస్తకళల ఏడీ సత్యమూర్తి, చేనేత వస్త్రాల ఏడీలు రమేష్, వెంకట రావు, మూర్తి, ఎల్డీఎం రవికుమార్, పర్యాటకశాఖ ఆర్‌డీ రమణ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు, ఏపీడీ ప్రభావతి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చంద్రశేఖర్, సెట్విన్ సీఈఓ మోహన్ కుమార్ పాల్గొన్నారు.

పారదర్శకంగా డీఎస్సీ పరీక్షలు

తిరుపతి అర్బన్ : జిల్లాలో డీఎస్సీ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించినట్లు డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జూన్ 6 నుంచి మొత్తం 8 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 33,181 మంది అభ్యర్థులకు గాను 30,952 మంది హాజరైనట్లు వెల్లడించారు. 2,229 మంది గైర్హాజరైనట్లు వివరించారు. ప్రశాంతంగా పరీక్షలు పూర్తి చేసేందుకు సహకరించిన అన్ని విభాగాల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుమల హోటళ్లలో ధరలపై అసత్య ప్రచారం

తిరుమల : తిరుమలలోని హోటళ్లలో ఆహార పదార్థాల ధరలపై సోషల్ మీడియాల్లో సాగుతోందని అసత్య ప్రచారమని టీటీడీ స్పష్టం చేసింది. బుధవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. తప్పుడు వార్తలను వైరల్ చేసి భక్తులను గందరగోళానికి గురి చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు చేపడతామని హెచ్చరించింది. భక్తులకు ఎలాంటి సమాచారం కావల్సి వచ్చినా టీటీడీ వెబ్‌సైట్ www.tirumala.org, కాల్ సెంటర్ 180042 54141కు ఫోన్ చేసి తెలుసుకోవాలని సూచించింది.

సర్వ దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో శ్రీవారి సర్వ దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో నాలుగు కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 76,126 మంది స్వామివారిని దర్శించుకోగా 24,720 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి భక్తులు హుండీలో రూ.3.97 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం అవుతోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

• అక్రమ అరెస్ట్‌పై ఆగ్రహం



చెవిరెడ్డి అరెస్ట్‌కు నిరసనగా బుధవారం భాకరాపేటలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ ర్యాలీ చేపట్టాయి

వివరాలు 8లో..

• సుమనోహరం



తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో బుధవారం కనులపండువగా పుష్పయాగ మహోత్సవం నిర్వహించారు. వివిధ రకాల ప్రత్యేక సుమాలు.. పత్రాలతో దేవదేవేరులను అర్చించారు. విశిష్ట విరుల నడుమ ఉభయ దేవేరీ సమేతంగా స్వామివారు దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అపురూప దృశ్యాన్ని వీక్షించి మొక్కులు చెల్లించుకున్నారు.

– తిరుపతి కల్చరల్

ప్రవేశం.. ఆక్రోశం

ఉన్నత విద్యామండలి నిర్లక్ష్యంతో వేలాది మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. యూజీ.. పీజీ సెట్ ఫలితాలు విడుదలైనప్పటికీ అడ్మిషన్లు చేపట్టకపోవడంపై ఆవేదన చెందుతున్నారు. విద్యా సంవత్సరం ఆరంభమైనా కౌన్సెలింగ్ నిర్వహణకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ కళాశాలల యాజమానులు ప్రవేశాల కోసం కాసుక్కూర్చున్నారు. దీంతో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ఎక్కడ చేర్పించాలనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఆలస్యం చేస్తే రెంటికీ చెడ్డ రేవడిగా మిగలాల్సి వస్తుందేమో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేట్‌కు కొమ్ముకాసేలా ఉన్నత విద్యామండలి వైఖరి ఉందని ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- యూజీ, పీజీ సెట్ అడ్మిషన్లపై అలసత్వం
- ఫలితాలు విడుదలైనా జాడ లేని కౌన్సెలింగ్
- పలు కోర్సుల్లో చేరేందుకు 80వేల మంది ఎదురుచూపులు
- కాసు క్కూర్చున్న ప్రైవేటు కళాశాలలు
- ఉన్నత విద్యామండలి వైఖరిపై మండిపడుతున్న విద్యార్థులు



పీజీ, యూజీ సెట్‌ల వివరాలు			
కేటగిరీ	పరీక్ష జరిగిన తేదీ	ఫలితాలు విడుదల	కౌన్సెలింగ్ తేదీ
ఏపీ ఐసెట్	మే 7	మే 20	ఊసేలేదు
లాసెట్	జూన్ 5	జూన్ 19	ఇప్పటివరకు ప్రకటించలేదు
పీజీఈసెట్	జూన్ 608	జూన్ 25	ఇప్పటివరకు ప్రకటించలేదు
పీజీసెట్	జూన్ 9-12	జూన్ 25	కౌన్సిలింగ్ ఊసేలేదు
ఈఏపీసెట్	మే 21- 27	జూన్ 8	ఈ నెల 17నుంచి అంటూ సమాచారం
ఎడ్‌సెట్	జూన్ 5	జూన్ 20	ఈ నెల 20-26 వరకు అంటూ వెల్లడి
ఈసెట్	మే 6	మే 15	ఈనెల 4 నుంచి 8వరకు
పాలిసెట్	ఏప్రిల్ 30	మే 14	జూన్ 30న ప్రారంభమైంది
నీట్	మే 4	జూన్14	ఇప్పటివరకు ప్రకటించలేదు

తిరుపతి సిటీ : విద్యా సంవత్సరం ప్రారంభమై మాసం గడిచింది. డిగ్రీ, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు పీజీ, యూజీ కోర్సులలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఇందు కోసం రాష్ట్ర ఉన్నత విద్యామండలి పీజీ, యూజీ సెట్‌ను మే, జూన్‌లో నిర్వహించింది. దాదాపు అన్ని పీజీ, యూజీ సెట్‌ల ఫలితాలు సైతం విడుదలయ్యాయి. కానీ, ఇప్పటి వరకు ఒక్క పీజీ, యూజీ కోర్సులకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించిన పాపాన పోలేదు. కొన్ని పీజీసెట్‌లకు కౌన్సెలింగ్ అధికారులను సైతం ఇప్పటివరకు నియమించిన దాఖలాలు లేవు. జూలై ప్రారంభమైనా కౌన్సెలింగ్ తేదీలను ప్రకటించకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

సందిగ్ధంలో తల్లిదండ్రులు

పీజీ, యూజీ సెట్‌ల ఫలితాలు విడుదలైనా కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. కౌన్సెలింగ్‌లో పిల్లలకు సీటు దక్కకపోతే ఏం చేయాలనే సందిగ్ధంలో ఉన్నారు. ఇప్పటికే ప్రైవేటు విద్యాసంస్థలలో ముందస్తు పీజీ, యూజీ, ఇంజినీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి కావస్తున్న నేపథ్యంలో తమ పిల్లల పరిస్థితి ఏంటనే ఆలోచనలో పడ్డారు. ఇటు ప్రభుత్వ సంస్థలలో సీటు దక్కక అటు ప్రైవేటు కళాశాలల్లో సీటు దొరకని పరిస్థితిలో ఏంచేయాలనే అయోమయంతో ఉన్నారు. దీంతో ఇప్పటికే పలు విద్యాసంస్థలలో టోకెన్ అమౌంట్ చెల్లించి సీటు రిజర్వ్ చేసుకుంటున్నారు.

తప్పని ఎదురుచూపులు

జిల్లాలో పలు పీజీ, యూజీ కోర్సుల్లో చేరేందుకు సుమారు 80వేల మంది విద్యార్థులు కౌన్సెలింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. ఇందులో ప్రధానంగా ఏపీ ఐసెట్, ఏపీ లాసెట్, ఏపీ పీజీఈ సెట్, ఏపీ ఈఏపీ సెట్, ఏపీ ఈసెట్, ఏపీ పీజీసెట్, ఏపీ ఎడ్‌సెట్ ఫలితాలు ఇప్పటికే విడుదలై కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. ఇందులో పాలిసెట్‌కు మాత్రం కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా, ఏపీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌ను ఈనెల 17వ తేదీ నుంచి మొదలుపెట్టనున్నట్లు సమాచారం. మిగిలిన పీజీ సెట్లపై ఉన్నత విద్యామండలి ఇప్పటి వరకు కౌన్సెలింగ్ అధికారులను సైతం నియమించే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం. మరో పక్క ఎంబీబీఎస్ ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ ఫలితాలు విడుదలై నెలకు పైగా గడుస్తున్నా ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం సైతం కౌన్సెలింగ్ ప్రారంభించకపోవడంతో తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

జీవితాలతో చెలగాటం



పీజీ, యూజీ కోర్సులలో ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించి నెలలు గడుస్తున్నా కౌన్సెలింగ్ చేపట్టకపోవడం దారుణం. నీట్‌పై ఇప్పటికీ న్యాయస్థానాల పరిధిలో విచారణ జరుగుతోంది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్వహించి పీజీ సెట్ల ఫలితాలు విడుదలైనా కనీసం కౌన్సెలింగ్ అధికారులను సైతం నియమించకపోవడం బాధాకరం. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాటమాడుతున్నారు.

– అశోక్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర యూనివర్సిటీల కన్వీనర్

కార్పొరేట్ సంస్థల కోసమే..



వర్సిటీలలో, ప్రభుత్వ కళాశాలలో పీజీ, యూజీ ప్రవేశాలు తగ్గడానికి ప్రధాన కారణం కౌన్సెలింగ్ ప్రక్రియను ఆలస్యం చేయడమే. ఉన్నత విద్యామండలి అధికారులు కార్పొరేట్ విద్యాసంస్థలలో అడ్మిషన్లు పెంచాలనే కుట్రతో ఇలా వ్యవహరిస్తున్నారనే అనుమానం కలుగుతోంది. ఇలాంటి కుటిల చర్యలు సరికాదు.

– బండి చలపతి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి

అగమ్యగోచరం



ఎంబీఏ, ఎంసీఏ, ఎంఏ, ఎమ్‌కామ్, ఎమ్మెస్సీ కోర్సులలో అడ్మిషన్లు వర్సిటీలలో దారుణంగా పడిపోతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం ఉన్నత విద్యామండలి అలసత్వమే. ప్రవేశ పరీక్షలు నిర్వహించి నెలలు గడుస్తున్నా కౌన్సెలింగ్ చేపట్టకపోవడంతో విద్యార్థులు తమకు సీటు రాదనే అనుమానంతో ప్రైవేటు కళాశాలలను ఆశ్రయిస్తున్నారు.

– డాక్టర్ బి.ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

సీటు వస్తుందో రాదో అని..



మా అబ్బాయి ఇంటర్ పూర్తి చేశాడు. ఎంసెట్‌లో అర్హత సాధించాడు. కానీ, ఇప్పటి వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కాలేదు. దీంతో తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ముందస్తుగా ఫీజు చెల్లించి సీఎస్‌ఈ కోర్సులో అడ్మిషన్ చేయించాం. సకాలంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తే ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు. ప్రభుత్వ విద్యాసంస్థలోనే చేర్పించేవాళ్లం.

– ప్రమీలమ్మ, విద్యార్థి తల్లి, తిరుపతి

ఎదురు చూస్తున్నాం



మా అమ్మాయి తిరుపతిలోని టీటీడీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. ఎంసీఏలో చేరాలని మే 7వ తేదీన ఐసెట్ రాసింది. మే 20న ఫలితాలు విడుదలయ్యాయి. కానీ, ఇంతవరకు ఐసెట్ కౌన్సెలింగ్ ఊసే లేదు. ప్రైవేటు కళాశాలలో చేర్పించాలంటే అంత ఫీజులు కట్టుకోలేని పరిస్థితి. కౌన్సెలింగ్‌లో ఫ్రీ సీటు వస్తుందా రాదా అనే అనుమానం ఉంది.

– రవిచంద్రారెడ్డి, విద్యార్థిని, తండ్రి, తిరుపతి రూరల్

రెచ్చిపోతే సహించం



సర్పంచ్ భారతి, దామోదర్‌నాయుడు, భార్గవ్‌ను పరామర్శిస్తున్న భూమన కరుణాకరరెడ్డి



తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అజయ్, రోజాను పరామర్శిస్తున్న భూమన

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటాం
- టీడీపీ గూండాల దౌర్జన్యాలను అడ్డుకుంటాం
- దళితులు, మహిళలపై దాడి అమానుషం
- బాధితులను పరామర్శించిన భూమన

తిరుపతి మంగళం/ చంద్రగిరి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన సాగిస్తూ వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసుకుని అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతోందని పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ గూండాల దాడుల్లో గాయపడిన పనపాకం, ముంగిలిపట్టు గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలను బుధవారం ఆయన పరామర్శించారు. భూమన మాట్లాడుతూ పనపాకంలో దళిత కుటుంబానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత అజయ్ ఆయన భార్య రోజాతో పాటు వారి సోదరిపై టీడీపీ నేతలు సభ్య సమాజం తలదించుకునేలా దాడి చేశారన్నారు. బాధితుల దుస్తులు చించివేసి, చెప్పు కాళ్లతో తన్ని విచక్షణారహితంగా కొట్టారని మండిపడ్డారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి లేడని, ఇక జైలు నుంచి రాడని, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నియోజకవర్గంలో లేడనే ధైర్యంతో పచ్చమూక రెచ్చిపోతోందని, ఇకపై వారిని సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. టీడీపీ నేత సుబ్రమణ్యం నాయకుడు కక్షగట్టి, కళ్లలో కారం కొట్టి అజయ్, ఆయన సతీమణి రోజాపై దుర్మార్గంగా దాడి చేశాడన్నారు. అలాగే ముంగిలిపట్టు సర్పంచ్ భారతి, ఆమె భర్త దామోదర్‌నాయుడు, కుమారుడు భార్గవ్‌పై టీడీపీ నాయకులు దాడులకు తెగబడడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సర్పంచ్ తాళిబొట్టు కూడ తెంచేసి కుమారుడు భార్గవ్ చెయ్యి విరిచేశారన్నారు. ఈ క్రమంలో మాకు అధికారం వచ్చినప్పుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చూపే తీవ్రత ఎలా ఉంటుందో మీరే ఆలోచించుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమచంద్రకుమార్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి రూరల్ మాజీ ఎంపీపీ చిలమంద మునికృష్ణ, నేతలు పొర్లపల్లె చంద్రశేఖర్‌రెడ్డి, అగరాల భాస్కర్‌రెడ్డి, మస్తాన్, దేవారెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఒంటి శివ, కొత్తపాటి కోటి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, ప్రవీణ్, సూరి పాల్గొన్నారు.

రసాభాసగా తడుకు ప్రజాభిప్రాయ సేకరణ



ఆర్డీఓ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న గంగాధరం

పుత్తూరు : మండల పరిధిలోని తడుకు సచివాలయం వద్ద బుధవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కోసం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా ముగిసింది. సర్పంచ్ వెంకటేశు అధ్యక్షతన సభ నిర్వహించారు. పొల్యూషన్ ఈఈ రాజశేఖర్ మాట్లాడుతూ.. తడుకు రెవెన్యూ లెక్క దాఖలాలోని సర్వే నెంబర్ 182/పి లోని 6 హెక్టార్లు ఆర్.మధుసూదన్‌రావు రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోన్ వారికి, సర్వే నంబర్ 507/2 లోని 2.520 హెక్టార్లు శ్రీకనకదుర్గ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోన్ తవ్వకాలకు ఇ-వేలం ద్వారా బిడ్డర్లుగా ఎంపిక చేసినట్లు ప్రకటించారు. ఇందుకు గాను లీజు జారీ చేయడానికి గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడి స్థితిగతులు, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా తడుకు పంచాయతీ ఎంపీటీసీ సుబ్బరత్నమ్మ భర్త గంగాధరం మాట్లాడడానికి ప్రయత్నించగా క్వారీ సిబ్బంది అడ్డుకున్నారు. బలవంతంగా సచివాలయం గదిలోకి తీసుకెళ్లి తాము పరిష్కరిస్తామంటూ గంటకు పైగా నిర్బంధించారు. అనంతరం పట్టుబట్టి బయటకు వచ్చిన గంగాధరం ఆర్డీఓ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేసి, క్వారీలకు అనుమతి ఇవ్వరాదంటూ కోరారు. అలాగే గుంతకల్లు, తాడిపత్రి నుంచి వచ్చిన పర్యావరణ వేత్తల బృందాన్ని సైతం మాట్లాడడానికి సాక్ష్యాత్తు పొల్యూషన్ ఈఈ రాజశేఖర్ అనుమతించలేదని గ్రామస్తులు ఆరోపించారు. పర్యావరణవేత్తల బృందానికి, క్వారీ యజమానుల సిబ్బంది మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. ఈ గందరగోళం మధ్యనే సభను ముగించారు. కార్యక్రమంలో పొల్యూషన్ ఏడీ మధన్‌మోహన్‌రెడ్డి, ఏఈ శశికళ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యూరియా.. ఏదయా..?



తిరుపతి అర్బన్ : కూటమి సర్కార్ ఏర్పడినప్పటి నుంచి రైతులను పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెట్టుబడి సాయంగా అందించాల్సిన అన్నదాతా సుఖీభవ నిధుల సంగతి దేముడెరుగు, కనీసం సబ్సిడీ విత్తనాలు, పనిముట్లు సంగతి నామమాత్రమేనని చర్చ సాగుతోంది. ముఖ్యంగా రైతులకు ఎరువులు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా రైతులు 80వేల ఎకరాల్లో వరి పంట సాగు చేపట్టారు. ఇందుకోసం 35వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముంది. అయితే వ్యవసాయశాఖ అధికారులు ఈ సీజన్‌లో ఇప్పటి వరకు కేవలం 7,500 మెట్రిక్ టన్నుల యూరియాను అందించినట్లు చెబుతున్నారు. రైతులకు 27,500 మెట్రిక్ టన్నుల యూరియా ఇంకా కావాల్సి ఉంది. ఈక్రమంలో ప్రైవేటు వ్యాపారులు 17,500 మెట్రిక్ టన్నులు విక్రయించినట్లు తెలుస్తుంది. అయినప్పటికి మరో 10వేల మెట్రిక్ టన్నులు యూరియా అన్నదాతలకు అవసరమవుతోంది. ఈ సీజన్‌లో పంట చివరి దశకు చేరుకుంది. ఈ సమయంలో పంటకు వేయాల్సిన యూరియా కోసం రైతులు నానా తిప్పలు పడుతున్నారు. సాధారణంగా యూరియా బస్తా రూ. 266.50కి విక్రయించాల్సి ఉంది. అయితే కొందరు ప్రైవేటు వ్యాపారులు సిండికేట్‌గా మారి, బస్తా యూరియాను రూ. 285 నుంచి రూ.300లకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

గ్యాస్ ట్యాంకర్ బోల్తా



ఓజిలి: నెల్లూరు– చెన్నై జాతీయ రహదారిపై పెదపరియ క్రాస్ సమీపంలో బుధవారం ఉదయం గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడింది. గుజరాత్ నుంచి చెన్నైకు గ్యాస్‌లోడ్‌తో లారీ వెళుతోంది. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ప్రమాదం జరిగింది. అయితే గ్యాస్ లీక్ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

కాలువ కట్ట కింద మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దక్కిలి : మండల కేంద్రానికి సమీపంలో తెలుగు గంగ కాలువ కట్ట కింద ఓ వృద్ధుడి మృతదేహాన్ని బుధవారం ఆలస్యంగా గుర్తించారు. ఆ ప్రాంతంలో దుర్వాసన రావడంతో కట్టపై వాకింగ్ చేస్తున్న వారు అక్కడి ముళ్లపొదల్లో మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ శివ శంకర్ తన సిబ్బందితో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సైదాపురం మండలం అన్నంరాజుపల్లెకు చెందిన కోండూరు రవీంద్రరాజు (60)గా గుర్తించారు. మృతుడు రెండు రోజులు కిందట దేవునివెల్లంపల్లి స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలో అవధూత గురుకల పోలయ్యస్వామి ఆరాధన మహోత్సవానికి వచ్చాడని, అతిగా మద్యం తాగడంతో మరణించి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

అక్రమ అరెస్ట్‌పై ఆగ్రహం

- భాకరాపేటలో భారీ ర్యాలీ.. నిరసన



గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు

తిరుపతి రూరల్ : మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసు బనాయించి అప్రజాస్వామికంగా అరెస్ట్ చేసిందని, ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డిపై సైతం కక్షగట్టిందని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడు మహాత్మా అంటూ.. బుధవారం భాకరాపేటలోని పార్టీ కార్యాలయం నుంచి గాంధీజీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. చెవిరెడ్డి అరెస్ట్‌కు నిరసనగా నినాదాలు చేశారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి సీడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సహదేవరెడ్డి, ఎంపీపీ యుగంధర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సింహాల మోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. సహదేవరెడ్డి మాట్లాడుతూ చెవిరెడ్డి కుటుంబంపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, జగనన్న సైనికులను జైలుకు పంపి భయపెట్టాలని చూస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం సిట్ అధికారులు లిక్కర్ కేసులో తప్పులు మీద తప్పులు చేస్తున్నారని, దీనికి భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకుంటారని స్పష్టం చేశారు. ఎంపీపీ యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి ప్రజలను బిడ్డల్లా చూసుకున్న చెవిరెడ్డికి కష్టం వస్తే ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుడికే వచ్చినట్టు బాధపడుతున్నారని తెలిపారు. సింహాల మోహన్ మాట్లాడుతూ చెవిరెడ్డిపై ఎన్ని రకాలుగా అక్రమ కేసులు పెట్టినా, కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ యశోద, రామచంద్రాపురం జెడ్పీటీసీ సభ్యులు ఢిల్లీరాణి మాట్లాడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగంతో ప్రజాస్వామ్యాన్ని చంపేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, భాకరాపేట సర్పంచ్ భూపాల్, యూత్ అధ్యక్షుడు మునిరెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు శేఖర్ పాల్గొన్నారు.

పకడ్బందీగా నేర నియంత్రణ

తిరుపతి క్రైమ్ : జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులు పెంచి పకడ్బందీగా నేర నియంత్రణ చేసినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జూన్‌కు సంబంధించి పోలీస్‌శాఖ పురోగతిని వివరించారు. ప్రతిరోజూ స్పెషల్ పార్టీ పోలీసులతో ముఖ్య పట్టణాల్లో గస్తీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రాత్రివేళల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న 1,837 మందిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వివరించారు. అలాగే సుమారు 18 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై 1,687 కేసులు నమోదు చేసి, కోర్టు ద్వారా జరిమానా విధించినట్లు తెలిపారు. 297 మంది వాహనదారులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ క్రమంలోనే రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 1,969 మంది చిరు వ్యాపారులపై న్యూసెన్స్ యాక్ట్ కింద కేసులు పెట్టినట్టు వెల్లడించారు. శాంతిభద్రతల రక్షణే లక్ష్యంగా జిల్లాలోని 314 మంది రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వివరించారు.

స్వర్ణ నారావారిపల్లె అభివృద్ధికి ప్రణాళికలు

అధికారులతో సమీక్షించిన కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: స్వర్ణ నారావారిపల్లి–2029 అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ స్వర్ణ నారావారిపల్లి అభివృద్ధికి ఇప్పటి వరకు చేపట్టిన అంశాలు, చేయాల్సిన పనులపై ప్రత్యేక అధికారి, డీపీఓ సుశీలాదేవిని ప్రశ్నించారు. ఆమె చేపడుతున్న పనులను వివరించారు. బ్యాంక్ లింకేజ్ ద్వారా స్వయం సహాయ సంఘాలకు రుణాల మంజూరు, వ్యవసాయ రంగానికి సంబంధించి కిచెన్ గార్డెనింగ్, టెరస్ గార్డెనింగ్‌పై గుర్తించిన కుటుంబాలకు శిక్షణ ఇవ్వడం, రైతుల పొలాల్లో కిట్ల ఏర్పాటు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ వివరించారు. డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, డీఎంహెచ్‌ఓ బాలకృష్ణనాయక్, సీపీఓ వెంకటేశ్వర్లు, పశుసంవర్ధకశాఖ ఏడీ ప్రసాద్, మైక్రో ఇరిగేషన్ జిల్లా అధికారి సతీష్, మార్కెటింగ్ ఏడీ సురేంద్రబాబు, ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్రనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నరేంద్రబాబు, సివిల్ సప్లయిస్ జిల్లా అధికారి శేషాచలం రాజు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు కన్నీటి వీడ్కోలు



చిట్టిబాబును పరామర్శిస్తున్న నేతలు

నాయుడుపేటటౌన్ : దుబాయ్‌లో ప్రమాదవశాత్తు గాయపడి చికిత్సపొందుతూ శనివారం కన్నుమూసిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మదిరి మునిరత్నం(36) మృతదేహం బుధవారం సాయంత్రం నాయుడుపేటకు చేరింది. బలిజ ఐక్యవేదిక నేత మదిరి చిట్టిబాబు పెద్ద కుమారుడైన మునిరత్నం భౌతికకాయానికి పెద్దసంఖ్యలో స్థానికులు నివాళులర్పించారు. బంధుమిత్రుల రోదనల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు. చిట్టిబాబును వైఎస్సార్‌సీపీ నేతలు పరామర్శించారు.

వీసీ కోసం వెతుకులాట!

- ఎస్వీయూ వైస్ చాన్సలర్ నియామకానికి సెర్చ్ కమిటీలు



ఎస్వీయూ పరిపాలన భవనం

తిరుపతి సిటీ : ఎస్వీయూ వీసీ నియామకంపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ఏడాదిగా పూర్తి స్థాయి వైస్ చాన్సలర్‌ను నియమించేందుకు ఇప్పటికే రెండు సార్లు సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఇటీవల సమావేశమైన రెండో సెర్చ్ కమిటీ ఓ మంత్రి తోడల్లుడు సిఫార్సు చేసిన రెండు పేర్లతో పాటు ప్రస్తుత ఇన్‌చార్జి వీసీ పేరును ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దీనిపై తమ వారిని పక్కన పెట్టారని కూటమిలో భాగమైన ఓ ప్రధాన పార్టీ నేత మండిపడ్డట్టు సమాచారం. ఈక్రమంలో వీసీ నియామక ప్రక్రియ సందిగ్ధంలో పడింది. మొదటి, రెండో సెర్చ్ కమిటీ సమర్పించిన నివేదికలను రద్దు చేసి ప్రస్తుతం మరోసారి మూడో సెర్చ్ కమిటీని నియమించేందుకు ఉన్నత విద్యామండలి కసరత్తు ప్రాంభించినట్లు విశ్వసనీయ సమాచారం.

ఒత్తిడిలో కమిటీలు

ప్రధానంగా ఎస్వీయూ వీసీ నియామకంపై ఏర్పాటు చేసిన సెర్చ్ కమిటీలపై రాజకీయ ఒత్తిడి అధికంగా ఉన్నట్లు తెలిసింది. అందుకే సెర్చ్ కమిటీలో సభ్యులుగా తమను ఎంపిక చేయవద్దని పలువురు ఉన్నత విద్యామండలి అధికారులకు మొరపెట్టుకుంటున్నట్లు సమాచారం. ప్రతిభ, అనుభవం, సామాజిక వర్గ సమీకరణల ప్రాతిపదికన వీసీ నియామకానికి సమర్థులైన ముగ్గురు వ్యక్తులను సెర్చ్ కమిటీ ప్రతిపాదిస్తే వాటిని రద్దు చేయడం ఎంతవరకు సమంజసమని విద్యావంతులు, మేధావులు ప్రశ్నిస్తున్నారు. దీంతో ఇప్పట్లో ఎస్వీయూకు పూర్తి స్థాయి వీసీ నియామకం జరిగేలా లేదని పలువురు చర్చించుకుంటున్నారు.



బడి కోసం..ఆగని పోరాటం



నారాయణవనంలో ధర్నా నిర్వహిస్తున్న తల్లిదండ్రులు, విద్యార్థులు

నాయుడుపేటటౌన్ : పేద విద్యార్థులకు చదువును దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం యత్నిస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుపేదలు విద్యాభ్యాసం చేసే ప్రాథమిక పాఠశాలలను మోడల్ బడుల్లో విలీనం చేసేందుకు తెగబడుతోందని మండిపడ్డారు. బుధవారం ఈ మేరకు నాయుడుపేట చంద్రబాబు నాయుడు కాలనీలోని బడిలో ఉన్న 3,4,5 తరగతులను చదివే విద్యార్థులను తుమ్మూరు మోడల్ పాఠశాలలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై నిరసన తెలిపారు. బడికి తాళం వేసి ఆందోళన చేపట్టారు. ప్రధానోపాధ్యాయిని ప్రేమలీలను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ మునిరత్నం హుటాహుటిన పాఠశాలకు చేరుకుని తల్లిదండ్రులతో మాట్లాడారు. నచ్చజెప్పి పాఠశాలకు తాళం తీయించారు. ఈ సందర్భంగా స్కూల్‌కమిటీ చైర్‌పర్సన్ నిర్మల మాట్లాడుతూ 25 మంది విద్యార్థులను తుమ్మూరులోని పాఠశాలకు పంపడం దారుణమన్నారు. రైలు పట్టాలు దాటుకుని పిల్లలు అంత దూరం వెళ్లలేరని స్పష్టం చేశారు.

హైవేపై ధర్నా

నారాయణవనం: మా పిల్లలు మా ఊరి బడిలోనే చదవాలంటూ బుధవారం మండలంలోని ఇప్పన్‌తాంగాళ్ దళితవాడ పాఠశాల పిల్లలు, తల్లులు జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. 14 మంది విద్యార్థులను 3 కిలోమీటర్ల దూరంలోని డీకే పాళ్యం మోడల్ స్కూల్‌కు పంపడానికి ఒప్పుకోమంటూ స్పష్టం చేశారు. బీఎస్పీ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి ధనుంజయ మాట్లాడుతూ బడుల విలీన నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేవారు.

కొలువుల కోత

- రేషనలైజేషన్ పేరుతో సచివాలయాల కుదింపు
- ప్రశ్నార్థకంగా ఉద్యోగుల భవిత
- ప్రభుత్వ వైఖరిపై సిబ్బంది ఆగ్రహం



సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు(ఫైల్)

తిరుపతి అర్బన్ : క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం, సత్వరమే సేవలు అందించే సచివాలయ వ్యవస్థపై ప్రభుత్వం కక్షగట్టింది. రేషనలైజేషన్ పేరుతో ఉద్యోగుల మెడపై కత్తి పెట్టింది. ఈ మేరకు జిల్లాలోని 691 సచివాలయాలను 353కి తగ్గించింది. అదే క్రమంలో 5,625 మంది సిబ్బందికి గాను 3,650 మందికి మాత్రమే ప్రస్తుత బదిలీల్లో పోస్టింగ్ ఇచ్చింది. మిగిలిన 1,975 మంది సచివాలయ సిబ్బంది భవితను ప్రశ్నార్థకంగా మార్చేసింది.

ఉద్యోగుల తగ్గింపు!

సచివాలయాల్లోని ఒక్కో విభాగంలో 30 నుంచి 80 మంది ఉద్యోగులను తగ్గించినట్లు తెలుస్తోంది. ఒక్కో సచివాలయంలో 30 విభాగాలకు చెందిన ఉద్యోగులు ఉన్నారు. వీరిలో భారీగా కోత విధించినట్లు సమాచారం. తాజాగా నిర్వహించిన బదిలీల్లో వారికి పోస్టింగ్ ఇవ్వలేదు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే రేషనలైజేషన్ నేపథ్యంలో ఖాళీలు లేవని... ఏదో ఒకచోట సర్దుబాటు చేస్తామని చెబుతున్నారు. అప్పటి వరకు వారంతా రిజర్వులోనే ఉండాల్సిన దుస్థితి దాపురించింది.

నిబంధనలకు నీళ్లు

ఇటీవల చేపట్టిన బదిలీల్లో నిబంధనలకు నీళ్లు వదిలేశారని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పోటీ పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించి ఉద్యోగాలు పొందామని గుర్తు చేస్తున్నారు. అయితే అధికారులు మాత్రం కూటమి నేతల సిఫార్సు ఉన్నవారికి మాత్రమే పోస్టింగ్ ఇచ్చారని ఆరోపిస్తున్నారు. అలాగే లంచాలు ముట్టజెప్పిన వారికి సైతం ప్రాధాన్యమిచ్చారని మండిపడుతున్నారు. మిగిలిన వారిని పట్టించుకోకుండా రిజర్వులో పెట్టేశారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వేతనం కూడా నిలిపేసే ప్రమాదముందని, తమ కుటుంబాలు రోడ్డున పడతాయని వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయకుంటే కోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని స్పష్టం చేస్తున్నారు.

జిల్లా సమాచారం

డివిజన్	గతంలో సచివాలయాల సంఖ్య	ప్రస్తుతం
తిరుపతి	245	125
శ్రీకాళహస్తి	154	82
సూళ్లూరుపేట	137	68
గూడూరు	155	78
మొత్తం	691	353

నగదు చెల్లించలేదని నిరసన



నిరసన తెలుపుతున్న రైతులు

వరదయ్యపాళెం: మండలంలోని కంచరపాళెం సమీపంలోని రెడ్డిగుంట వద్ద ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసిన దళితుల భూములను తమిళనాడుకు చెందిన కొందరు భూస్వాములు కొనుగోలు చేశారు. సుమారు 60 మంది రైతులు 60 ఎకరాలను ఏడాది క్రితం విక్రయించారు. ఎకరా రూ.17 లక్షల చొప్పున కొనుగోలు చేసిన భూస్వాములు, ఒక్కో రైతుకు రూ.15 లక్షలు మాత్రమే చెల్లించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. రిజిస్ట్రేషన్ తర్వాత మిగిలిన రూ.2 లక్షల సొమ్మును చెల్లిస్తామని నమ్మబలికారు. అయితే ఈ ఏడాది గడిచిపోయినా పెండింగ్ నగదు చెల్లించకనే కొనుగోలు చేసిన భూముల్లో ప్రహరీగోడ పనులను చేపట్టారు. బుధవారం ఈమేరకు బాధిత రైతులు అక్కడకు వెళ్లి నిర్మాణ పనులు చేపట్టుకోవాలని పనులు అడ్డుకున్నారు. తమకు పూర్తిస్థాయి నగదు చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలని తేల్చి చెప్పారు. ఈ మేరకు అక్కడే నిరసన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి : మండలంలోని తొండమనాడు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ డ్రైవర్ మృతి చెందాడు. వివరాలు.. ఏర్పేడు మండలం బండారుపల్లెకు చెందిన పూజారి శోభన్‌బాబు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో నెల్లూరు నుంచి తిరుపతి వైపు చేపల లోడ్‌తో వెళుతుండగా తిరుపతి నుంచి విజయవాడకు వెళుతున్న వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో శోభన్‌బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు మోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చనేతను వదిలేసి.. పక్కనోళ్లపై కేసు

చంద్రగిరి : మండలంలోని జరిగిన ఓ దాడి కేసులో అసలు సూత్రధారి అయిన పచ్చనేతను పోలీసులు వదిలేసి, ఆయనతో కలిసి వెళ్లిన వారిపై కేసు నమోదు చేయడం చర్చనీయాంశమైంది. వివరాలు.. సోమవారం ఏ.రంగంపేటలో మద్యం దుకాణం వద్ద స్థానిక టీడీపీ నేతకు, నారావారిపల్లెలోని మరో నేతకు గొడవ జరిగింది. ఈ క్రమంలో ఏ.రంగంపేటకు చెందిన టీడీపీ నేతను ఆయన ఇంటికే వెళ్లి, నారావారిపల్లెకు చెందిన నేత బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో పగ పెంచుకున్న రంగంపేట టీడీపీ నేత, కొంత మంది యువకులతో కలసి నారావారిపల్లెలోని టీడీపీ నేత ఇంటికి వెళ్లి దాడికి దిగారు. దీంతో ఆ నేత దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే గొడవకు ప్రధాన కారణమైన ఏ.రంగంపేట టీడీపీ నేతను ఫిర్యాదులో తప్పించి, ఆయన వెనుక వెళ్లిన వారిపై పోలీసులు కేసు నమోదు చేయడంపై బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు వారిని వదిలేసి, అమాయకులపై పోలీసులు కేసు నమోదు చేయడంపై మండిపడుతున్నారు.

నేటి నుంచి తిరుపతి ఐఐటీలో అంతర్జాతీయ సదస్సు

ఏర్పేడు : ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్ అండ్ స్ట్రక్చర్స్‌పై గురువారం నుంచి మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఐఐటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ సదస్సు జరగనుంది. నిర్మాణ రంగం మెటీరియల్, టెక్నాలజీ, హెల్త్ మానిటరింగ్, రెట్రోఫిట్టింగ్, స్మార్ట్ టెక్నాలజీపై ఈ సదస్సులో చర్చించనున్నారు.

పోలీసులపై టీడీపీ నేతల జులుం

కలువాయి(సైదాపురం) : కలువాయి మండలం చీపీ నాపి గ్రామ చెరువులో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. బుధవారం ఈ మేరకు చెరువు నుంచి మట్టిని కొల్లగొడుతున్న జేసీబీ, ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. అయితే వెంటనే టీడీపీ నేతలు రంగంలోకి దిగారు. అవి మా బండ్లే వాటిని వదిలేయండి అంటూ హుకుం జారీ చేశారు. మాట వినకుంటే ఇబ్బందిపడతారని జులుం ప్రదర్శించారు. దీంతో పోలీసులకు ఆ వాహనాలను వదిలిపెట్టాల్సిన దుస్థితి దాపురించింది.

ఇసుక డంప్ సీజ్

సత్యవేడు: మండలంలోని రాజగోపాలపురం వద్ద తెలుగు గంగ కాలువ సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను తహసీల్దార్ రాజశేఖర్ ,శ్రీసిటీ పోలీసులు సీజ్ చేశారు. బుధవారం సాయంత్రం ఇసుక డంప్‌ను గుర్తించి ఈ మేరకు చర్యలు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను ఏడీ మైన్స్‌కు అప్పగించినట్లు తహసీల్దార్ వెల్లడించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి



రేణిగుంట : మండలంలోని గురవరాజుపల్లె ఎస్టీ కాలనీ సమీపంలో పూతలపట్టు–నాయుడుపేట హైవేపై మంగళవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ జింక మృతి చెందింది.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

తిరుపతి మంగళం : రవాణా, పోలీస్ శాఖల నిబంధనలను ఉల్లంఘించి వాహనాలకు నంబర్ ప్లేట్లు పెట్టుకుంటే చర్యలు తప్పవని జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు. బుధవారం తిరుమలలో రవాణా, ట్రాఫిక్ పోలీసులు వాహన నంబర్ ప్లేట్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇష్టారాజ్యంగా నంబర్ ప్లేట్లు పెట్టుకున్న 22 వాహనాలకు రూ. 1.31లక్షల జరిమానా విధించారు. రవాణాశాఖ అధికారి మాట్లాడుతూ నంబర్ ప్లేట్లపై వాహన నంబర్లను ఎలా పడితే అలా వేసుకుంటున్నారని, అలాగే వివిధ ఫొటోలను అంటించుకుంటున్నారన్నారు. నిబంధనల ప్రకారం వాహనాలపై అలాంటివి ఉండకూడదని సూచించారు. మోటారు వాహన తనిఖీ అధికారులు శ్రీనివాసరావు, మోహన్‌కుమార్, వెంకటరమణనాయక్, ట్రాఫిక్ సీఐ హరప్రసాద్ పాల్గొన్నారు.

నిషేధిత హారన్ వినిపిస్తే చర్యలు

తిరుపతి క్రైమ్ : జిల్లాలో నిషేధిత సౌండ్ హారన్ వినిపిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్పీ హర్షవర్ధన్ రాజు హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో దీనిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలు, బస్సులు, లారీలు తదితర వాహనాలు ఏవైనా సరే నిబంధనలకు అనుగుణంగా హారన్ అమర్చుకోవాలని స్పష్టం చేశారు. ఈ మేరకు 8099999977 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామకృష్ణ ఆచారి ఆధ్వర్యంలో తిరుమల జీఎం టోల్‌గేట్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. సుమారు 45 వాహనాలు తనిఖీ చేసి, 22 వాహనాలకు రూ.1.31 లక్షల జరిమానా విధించారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

జూనియర్ అండర్–21 అండ్ సీనియర్ సౌత్ ఆసియా కరాటేలో ఎంపికై శ్రీలంకలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్న హోంగార్డు కుమారుడిని ఎస్పీ హర్షవర్ధన్ రాజు అభినందించారు. ఎస్పీ కార్యాలయంలో హోంగార్డుగా పని చేస్తున్న కిషోర్ కుమారుడు సూర్య పదో తరగతి చదువుతున్నాడు. ఈనెల 3 నుంచి శ్రీలంకలో జరిగే కరాటే చాంపియన్ షిప్‌కు హాజరుకానున్నాడు. ఈ నేపథ్యంలో విద్యార్థికి ప్రోత్సాహకంగా ఎస్పీ రూ.50వేలను వెల్ఫేర్ ఫండ్ నుంచి అందించారు.



విద్యార్థికి చెక్ అందిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు